క్లుప్తంగా

ఫ్లై ఓవర్ బ్రిడ్జి పూర్తి చేస్తాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు

గూడూరు: గూడూరులో గత కొన్నేళ్లుగా నిలిచిపోయిన ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులను తిరిగి త్వరలోనే ప్రారంభిస్తామని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు తెలిపారు. మంగళవారం విజయవాడలో ఇంజినీరింగ్ చీఫ్ నైముల్లా, చీఫ్ ఇంజినీర్ అడ్మినిస్ట్రేషన్ వేణుగోపాల్‌రెడ్డి, క్వాలిటీ కంట్రోల్ చీఫ్ ఇంజినీర్ రమేష్, చీఫ్ ఇంజినీర్ ఎలక్ట్రికల్ బుచ్చిరాజులను కలిసిన ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు గూడూరు ఫ్లైఓవర్ బ్రిడ్జిపై వారితో కలిసి మాట్లాడి పనులు ప్రారంభించాలని కోరారు.

ఎన్నికల కోడ్ అతిక్రమిస్తే చర్యలు

గూడూరు: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉందని, ఎవరైనా ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ సాయినాథ్ పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ వచ్చే నెల ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయన్నారు. ఈక్రమంలో ఎన్నికల కోడ్ అమల్లో ఉందన్నారు రాజకీయ పార్టీలకు సంబంధించిన ఫ్లెక్సీలను కూడా తొలగించామని చెప్పారు. అలాగే ఎక్కడైనా బహిరంగ ప్రదేశాల్లో సభలు, సమావేశాలు నిర్వహించడం కచ్చితంగా అనుమతులు తీసుకోవాలని ఆయన తెలిపారు.

తప్పు ఒప్పులను గుర్తించండి

చిల్లకూరు: ఎమ్మెల్సీ ఎన్నికల నియమావళిని అనుసరిస్తూ ఓటర్ల జాబితాలోని తప్పు ఒప్పులను గుర్తించి సరిచేయాలని బీఎల్‌ఓలను తహసీల్దార్ స్వర్ణ ఆదేశించారు. మండల రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం మండలంలోని అన్ని సచివాలయాల్లో పనిచేసే సిబ్బందికి బీఎల్‌ఓల విధులను అప్పగించారు. ఈక్రమంలో వారికి ఓటర్ల జాబితాను ఎలా నిర్వహించాలి అనే విషయాలపై అవగాహన కల్పించారు. అలాగే ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాలను సిద్ధం చేశామని, ఇంకా ఎవరైనా నమోదు చేసుకునేందుకు వస్తే వారికి ఫారంలు అందించి నమోదు ప్రక్రియను చేపట్టాలని అన్నారు. ఆర్‌ఐ రమ్యస్వాతి పాల్గొన్నారు.

కుంభాభిషేకానికి అంకురార్పణ


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

రాపూరు: రాపూరు గ్రామదేవత రాపూరమ్మ కుంభాభిషేకానికి మంగళవారం అంకురార్పణ అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక రాపూరమ్మ ఆలయం పునఃనిర్మాణం చేపట్టి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలను మూడు రోజులపాటు నిర్వహించనున్నారు. మంగళవారం వివిధ పూజలు నిర్వహించారు.

విద్యుత్ తీగలు తొలగించండి

వెంకటగిరి: పట్టణంలోని 14వ వార్డు పరిధిలోని నరసింహారావువీధి, బొగ్గులమిట్ట ప్రాంతాల్లో 50 ఇళ్లపై విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉన్నాయని ఈ మేరకు అధికారులు స్పందించి విద్యుత్ తీగలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని 14వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మునిరవిచంద్రకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. నరసింహారావువీధిలోని అరుంధతీయవాడ నుంచి బొగ్గులమిట్ట సబ్‌స్టేషన్ వరకు విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేయాలని కోరారు.

వేసవిలో ప్రత్యేక సదుపాయాలు


మాట్లాడుతున్న ఏపీడీ శ్రీహరిరెడ్డి

సైదాపురం: వేసవిలో ఉపాధి కూలీలకు ప్రత్యేక సదుపాయాలను కల్పించాలని ఏపీడీ శ్రీహరిరెడ్డి కోరారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఉపాధి కూలీలతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఎండలు విపరీతంగా కాస్తున్నాయని పనులకు వచ్చే కూలీలకు షెల్టర్‌తోపాటు మంచినీటి వసతి కూడా కల్పించాలన్నారు. అలాగే కూలీల సంఖ్య కూడా పెంచాలని కోరారు. ఏపీఓ మురళి పాల్గొన్నారు.

వేణుంబాకంలో వైద్యశిబిరం


వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

దొరవారిసత్రం: వేణుంబాకం గ్రామంలో మంగళవారం డీవీ సత్రం పీహెచ్‌సీ వైద్యాధికారి చైతన్య ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో వైద్యపరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. 104 సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నిందితుడికి జైలు శిక్ష

కోట: కోట మండలం మద్దాలికి చెందిన సంపూర్ణమ్మపై కుటుంబకలహాల కారణంగా దాడి చేసిన కేసులో నిందితుడు వెంకటయ్యకు కోట జూనియర్ సివిల్ జడ్జి భరత్‌కమల్ రెండేళ్ల జైలు శిక్ష, రూ.3వేల జరిమానా విధించినట్లు ఎస్‌ఐ పుల్లారావు మంగళవారం తెలిపారు.

కోరిన కోర్కెలు తీర్చే స్తంభాలగిరీశ్వరయ్య

- దక్షిణ కాశీగా ప్రతీతి
- 18న దేవునివెల్లంపల్లిలో మహాశివరాత్రి వేడుకలు

దక్కిలి: ఉమ్మడి పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో ప్రముఖ శైవక్షేత్రాల్లో ఒక్కటైన వెలుగొండలు కింద దేవునివెల్లంపల్లిలో వెలసిన స్తంభాలగిరీశ్వరయ్య స్వామి ఆలయంలో ఈనెల18న శనివారం మహాశివరాత్రి మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ చైర్మన్ నర్రావుల ప్రకాశంనాయుడు, ధర్మకర్త మండలి, దేవదాయ శాఖాధికారులు కలిసి ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. పచ్చని ప్రకృతి రమణీయత, కనువిందుచేసే ఎత్తైన కొండలు, దక్షిణ కాశీ శ్రీకాళహస్తి అంతటి ప్రాముఖ్యత కలిగినటువంటి ఆలయం అని చరిత్ర చెబుతుంది. ఇక్కడ ప్రతిచెట్టు, పుట్ట, కొండ, కోన అన్నీ స్వామి స్వరూపాలే. ఎన్నో జీవవైవిధ్యానికి నెలవుగా ఉన్న ఒక అద్భుత ఔషధ క్షేత్రమే స్తంభాలగిరీశ్వర స్వామి. వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. స్తంభాలగిరీశ్వరస్వామిని దర్శించుకుంటే సకల పాపాలు హరిస్తాయని కోరిన కోర్కెలను వెంటనే ప్రసాదిస్తూ స్వామివారు తమ మహిమాన్వితం చాటుకుంటారని ప్రతీతి. స్తంభాలగిరీశ్వరయ్యస్వామి ఆలయంలో ప్రతి సోమవారం అత్యంత వైభవంగా పూజలు నిర్వహిస్తారు. ఆలయ సమీపంలో ఉన్న కొలను భక్తులను అబ్బురపరుస్తుంది. ఆలయం చుట్టూ పచ్చని చెట్లు విస్తారంగా ఉండడంతో ఇక్కడ భక్తులు సేదదీరేందుకు అనువుగా ఉంటుంది. అలయం ఎగువభాగాన ఎత్తైన కొండల కింద పెద్ద బండరాతిన స్తంభాలగిరీశ్వరుడు దర్శినమిస్తారు. బండ రాయి లోపలకి వెలితే గుండాలు ఉంటాయి. మహాశిరాత్రి సందర్భంగా స్వామివారికి శనివారం ఉదయం 6గంటలకు రుద్రాభిషేకము, 7గంటలకు పూజ, నైవేద్యం, హారతి, రాత్రి 8గంటలకు పార్వతీ పరమేశ్వర్ల కల్యాణం, 8–30గంటలకు ఆషా నృత్య అకాడమీ శ్రీకాళహస్తి వారిచే భరతనాట్యం, భజన కార్యక్రమాలుతో పాటు ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు, 10–30 గంటలకు శివపార్వతుల గ్రామోత్సవం, అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవ అభిషేకం, 1–30 గంటలకు నైవేద్యం, హారతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ తెలిపారు.


స్తంభాలగిరీశ్వరయ్యస్వామి ఆలయం,


ప్రత్యేకాలంకరణలో స్తంభాలగిరీశ్వరయ్యస్వామి


దేవునివెల్లంపల్లిలో ఉన్న శివలింగం


ప్రత్యేకాలంకరణలో అమ్మవారు

సైబర్ నేరాలపై అవగాహన


వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న అధికారులు

దొరవారిసత్రం: దొరవారిసత్రంలోని సంఘమిత్ర కార్యాలయంలో మంగళవారం సంఘ మిత్ర మండల సమాఖ్య సమావేశం జరిగింది. సమావేశంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ సుభాష్ మాట్లాడుతూ ఆర్‌బీఐ ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా సైబర్ క్రైమ్ నేరాలపై మహిళలకు అవగాహన కల్పించారు. ఇందులో ఫోన్లు చేసి రుణాలు ఇస్తాం, లాటరీలో లక్షలు వచ్చాయని సైబర్ నేరగాళ్లు నమ్మబలికి మోసాలు చేస్తారు. ఇటువంటివి నమ్మవద్దని లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిళలకు తెలిపారు. అదే విధంగా పొదుపు మహిళలకు బ్యాంకు నుంచి రుణాలు సకాలంలో కట్టడంతో పాటు పొదుపు చేసుకోవడమేకాకుండా రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని ఏపీఎం పద్మావతి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సింగయ్య, సీసీలు, వీఓఏలు, సంఘబంధం అధ్యక్షుడు పాల్గొన్నారు.

నేడు నేదురుమల్లి రాక

వెంకటగిరి: వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి బుధవారం వెంకటగిరిలోని ఆయన నివాసంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులకు సాయంత్రం 4 గంటల నుంచి అందుబాటులో ఉంటారని నేదురుమల్లి కార్యాలయ వర్గాలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపాయి.

ఆక్రమణల తొలగింపుపై సర్వే

కోట: కోటలో ఆక్రమణల తొలగింపుపై అధికారులు దృష్టి సారించారు. గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ ఆదేశాల మేరకు మంగళవారం డివిజనల్ సర్వేయర్ రఘురామరాజు ఆధ్వర్యంలో సర్వే బృందం కోటక్రాస్ రోడ్డు నుంచి సర్వేను ప్రారంభించారు. రోడ్డుకు రెండు వైపుల సర్వేనంబర్ ఆధారంగా సర్వే చేసి మార్కింగ్ ఇచ్చారు. రెండురోజుల్లో సర్వే పూర్తి చేస్తామన్నారు. ఇటీవల ఆక్రమణలపై గూడూరు ఆర్డీఓకు ఫిర్యాదులు అందడంతో ఆక్రమణల తొలగింపుపై ఆయన అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన పలు రాజకీయపక్షాల నాయకులు ఆక్రమణలు తొలగించాలని తీర్మానం చేయడంతో సర్వేను ప్రారంభించారు. మండల సర్వేయర్ గోపి, సచివాలయం సర్వేయర్లు పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలి


కలువాయిలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, వైద్య సిబ్బంది


రాపూరులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

కలువాయి: ప్రజలు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలని మండల వైద్యాధికారి డాక్టర్ సురేంద్రబాబు అన్నారు. క్యాన్సర్‌పై అవగాహన నిమిత్తం మంగళవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నుంచి రెండు కిలోమీటర్ల మేర విద్యార్థులు, వైద్య ఆరోగ్యసిబ్బంది కలిసి సైకిల్ ర్యాలీ నిర్వహించారు. క్యాన్సర్ వ్యాధి, నివారణ గురించి నినాదాలతో పురవీధుల్లో ర్యాలీ నిర్వహించి ప్రజలను చైతన్యవంతం చేశారు. అనంతరం అవగాహన సదస్సు నిర్వహించారు. కుల్లూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో కూడా క్యాన్సర్ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు రామకుమారి, డాక్టర్ ప్రియాంక పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ

రాపూరు: రాపూరులో మంగళవారం వేపినాపి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యసిబ్బంది, విద్యార్థులతో కలిసి క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. వైద్యులు ధర్మేంద్ర మాట్లాడుతూ నిత్యం వ్యాయామం, యోగా, సైకిలింగ్, చేస్తే క్యాన్సర్, మధుమేహం, గుండెజబ్బులు నివారించుకోవచ్చన్నారు. సూపర్‌వైజర్ లింగమూర్తి, ఏఎన్‌ఎంలు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాలుడిని ఢీకొన్న బైక్

–ముగ్గురికి తీవ్రగాయాలు

గూడూరురూరల్: బాలుడిని బైక్ ఢీకొని అదుపుతప్పి రోడ్డుపై పడడంతో ముగ్గురు గాయపడ్డారు. ఈ ఘటన చెన్నూరు మూడో హరిజనవాడ సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. వైఎస్సార్ కాలనీకి చెందిన చరణ్‌తేజ అనే విద్యార్థి స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 3వ తరగతి చదువుతున్నాడు. స్కూల్ నుంచి ఇంటికి నడుచుకుంటూ వెళుతుండగా గూడూరు నుంచి చెన్నూరుకు వెళుతున్న వెంకటేష్, సాయికుమార్ బైక్ బాలుడ్ని ఢీకొట్టి అదుపుతప్పి రోడ్డుపై పడ్డారు. ఈ ప్రమాదంలో చరణ్‌తేజ తీవ్రంగా గాయపడగా వెంకటేష్, సాయికుమార్‌లకు రక్తగాయాలయ్యాయి. క్షతగాత్రులకు గూడూ రు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం చరణ్‌తేజను నెల్లూరుకు తరలించారు. పోలీసులకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌ను పాటించేలా చర్యలు


అవగాహన కల్పిస్తున్న కమిషనర్ శ్రీనివాసరావు

నాయుడుపేటటౌన్: మున్సిపాలిటీ పరిధిలో స్వచ్ఛ సర్వేక్షన్‌ను ప్రతిఒక్కరూ పాటించేలా శానిటరీ కార్యదర్శులు, ఇతర సిబ్బంది చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు ఆదేశించారు. పట్టణంలో చంద్రబాబు కాలనీలో మంగళవారం ఏర్పాటు చేసిన స్వచ్ఛసర్వేక్షణ్‌పై జరిగిన అవగాహన సదస్సులో కమిషనర్ మాట్లాడారు. సచివాలయ అధికారులు పారిశుద్య కార్మికులతో ఇంటింటికి వెళ్లి పారిశుద్యంపై పాటించాల్సిన విధానాలపై అవగాహన కల్పించాలన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో నాయుడుపేట మున్సిపాలిటీని ప్రథమంలో నిలిపేలా అందరూ కృషిచేయాలని కమిషనర్ ఆదేశించారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలో జగనన్న కాలనీల్లో జరుగుతున్న ఇంటి నిర్మాణ పనులకు కమిషనర్ పరిశీలించారు. ఇంటి నిర్మాణాలను త్వరిగతంగా పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

గూడూరు: పట్టణంలోని మిట్టపాళెం మహాలక్ష్మి అమ్మవారి గుడి సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి (50) మృతి చెందాడు. పోలీసులు ఘటనాస్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతుడి ఒంటిపై గులాబీ రంగు చొక్కా, బ్లూ గళ్ల లుంగీ ఉన్నట్లు తెలిపారు. ఇతర వివరాలు తెలియలేదన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాదక ద్రవ్య రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ రాజేంద్ర

వెంకటగిరి: ఏపీని మాదక ద్రవ్య రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేలా అన్ని వర్గాల్లో చైతన్యం తీసుకురావాలని తిరుపతి జిల్లా ఎస్‌ఈబీ అడిషనల్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఏ రాజేంద్ర తెలిపారు. స్థానిక ఎస్‌ఈబీ కార్యాలయంలో మంగళవారం గూడూరు డివిజన్ ఎస్‌ఈబీ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గంజాయి, సారా కేసుల్లోని పాతనేరస్తులపై గట్టి నిఘా ఉంచాలని తెలిపారు. మాదకద్రవ్యాల అనర్థాలపై అవగాహన కల్పించాలన్నారు. వెంకటగిరి ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు ఏఎస్పీకి ఘనస్వాగతం పలికారు.

దరఖాస్తు చేసుకోండి


దొరవారిసత్రం: దొరవారిసత్రం మండలం పరిధిలో సొంత స్థలం ఉండి పక్కాగృహం లేని వారు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించే పక్కాగృహం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపీడీఓ సింగయ్య తెలిపారు. ఆయా ప్రాంతాల్లోని వలంటీర్లు అర్హులను గుర్తించి వారికి సమాచారం అందించి గ్రామ సచివాలయాలకు వెళ్లి ఆన్‌లైన్ నమోదు చేసుకోవాలన్నారు.

పసికందు మృతిపై ఆందోళన


ఆస్పత్రి ఎదుట ఆందోళన చేస్తున్న పసికందు తండ్రి, బంధువులు

గూడూరు : తమ బిడ్డ మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ ఆస్పత్రి ఎదుట మంగళవారం ఓ వ్యక్తి ఆందోళనకు దిగాడు. వివరాలు.. మండలంలోని వెందోడుకు చెందిన కంటిపల్లి వెంకటేశ్వర్లు తన భార్య శివగామిని కాన్పు కోసం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఈ నెల 10వ తేదీన చేర్పించాడు. 11వ తేదీన శస్త్రచికిత్సతో వైద్యులు ప్రసవం చేశారు. బిడ్డ ఆరోగ్యంగానే ఉందని, ఎదురుగా ఉన్న చిన్నపిల్లల వైద్యశాలలో టీకా కూడా వేయించారు. ఇంతలో శిశువు ఆరోగ్య పరిస్థితి విషమించడంతో నెల్లూరుకు తరలించాలని బిడ్డ తండ్రికి సూచించారు. హుటాహుటిన నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ పసికందు మృతిచెందింది. దీంతో తండ్రి వెంకటేశ్వర్లు గూడూరులో డెలివరీ చేసిన ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగాడు. తన భార్య ప్రసవానికి రూ.2.50లక్షలు ఖర్చు పెట్టామని, అయినప్పటికీ బిడ్డ దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైద్యుల నిర్లక్ష్యమే శిశువు ప్రాణాలు తీసిందని ఆరోపించారు. దీనిపై సమాచారం అందుకున్న సీఐ హజరత్‌బాబు అక్కడకు చేరుకుని వైద్యులను విచారించారు. బిడ్డ పాలు తాగే సమయంలో పొరబాటున అవి ఊపిరితిత్తుల్లోకి వెళ్లడంతో వెంటిలేటర్ అవసరమని నెల్లూరుకు రెఫర్ చేశామని వైద్యులు వెల్లడించారు. బాధితులు ఫిర్యాదు చేయని కారణంగా కేసు నమోదు చేయలేదని సీఐ తెలిపారు.

ఆయుష్షు పెంచుకునేలా జీవనం చేయాలి


విద్యార్థులతో సైకిలింగ్ చేయిస్తున్న వైద్యులు, హెచ్‌ఎంలు

చిల్లకూరు: చిన్నపాటి వ్యాయామాలతో సగటు ఆయుష్షు పెంచుకునేలా ప్రయత్నించాలని చిల్లకూరు వైద్యులు సయ్యద్ షాలోమ్ అరాఫత్ సూచించారు. చిల్లకూరు, పారిచెర్లవారిపాళెం గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాలను మెగా సైక్లింగ్ మారథాన్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేడు మానవుని సగటు ఆయుష్షు తగ్గిపోతోందని దీనిని పెంపొందించుకునేందుకు ప్రతిఒక్కరూ కొన్ని నియమాలు పాటించాలని అన్నారు. నేడు తల్లిదండ్రుల తమ పిల్లలకు చిన్నతనంలోనే బైక్‌లకు అలవాటు పడేలా చేస్తున్నారని దీనివల్ల పిల్లల్లో కనీసం నడక రాకుండా పోతుందని అన్నారు. పాఠశాలలకు వెళ్లే పిల్లలకు సైకిలింగ్ చేయించేలా అలవాటు చేస్తే ఎన్నో వ్యాధులను దూరం చేసుకోవచ్చని అన్నారు. పిల్లలతో సైకిల్ తొక్కించారు. పాఠశాలల హెచ్‌ఎంలు కోదండరామయ్య, బండ్ల సుదాకర్, సీహెచ్‌ఓ లక్ష్మి, పీహెచ్‌సీ పర్యవేక్షకులు రవి, మునిలక్ష్మి, వైద్యసిబ్బంది సలీమాబేగం, పోలమ్మ, షాబీరా, సావిత్రి, మంజుల, సుజాత, కామాక్షి పాల్గొన్నారు.

విద్యుత్ అంతరాయానికి సహకరించాలి

వెంకటగిరి: పట్టణంలోని పాలకేంద్రం సమీపంలో ఉన్న 132కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని 50 మెగావాట్స్ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌లకు సంబంధించిన బ్రాక్‌లు ఫెయిల్ అయిన కారణంగా ఈనెల 17వ తేదీ వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనున్నట్లు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.మునిరవిచంద్ర మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో బాలాయపల్లి, మాటుమడుగు, దగ్గవోలు, కమ్మవారిపల్లి, వల్లివేడు, జీకేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 4గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు.

మహాకుంభాభిషేక మహోత్సవానికి రండి


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి, ఆలయ చైర్మన్ బాలచంద్రారెడ్డి, ఈఓ శ్రీనివాసులురెడ్డి

- ముఖ్యమంత్రిని ఆహ్వానించిన ఎమ్మెల్యే కిలివేటి, ఆలయ చైర్మన్, ఈఓ

సూళ్లూరుపేట: పట్టణంలో కాళంగీనదీ తీరాన వెలసియున్న చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో ఈ నెల 22 నుంచి 24 తేదీ వరకు నిర్వహించనున్న నూతన సువర్ణ విమానగోపుర శిఖర ప్రతిష్ట మహా కుంభాషేక మహోత్సవానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి తాడేపల్లిలో ఆయన క్యాంప్ కార్యాలయంలో సోమవారం రాత్రి కలిసి ఆహ్వానించారు. ఆలయ ప్రధాన అర్చకులు, వేదపండితులు ముళ్లపూడి హరిహరకుమార్ శర్మ వేదమంత్రాలతో ఆలయ మర్యాదలతో శాలువాతో సత్కరించి ఆహ్వానపత్రికతో పాటు తాంబూలం ఇచ్చి మహా కుంభాభిషేకం కార్యక్రమానికి విచ్చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి గురించి కూడా ముఖ్యమంత్రికి వివరించారు. సీఎం కూడా సానుకూలంగా స్పందించి కుంభాభిషేకం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని, వీలుంటే వస్తానని కూడా వారికి చెప్పారని ఈఓ తెలిపారు.

టెక్స్‌టైల్ పార్కు భూముల పరిశీలన


బుసపాళెం భూముల మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ కిరణ్‌కుమార్

వెంకటగిరిరూరల్: మండలంలోని బుసపాళెం గ్రామం సమీపంలోని సర్వే నంబర్ 141లో టెక్స్‌టైల్ పార్కు నిమిత్తం కేటాయించిన 50 ఎకరాల ప్రభుత్వ భూమిని గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్, హ్యాండ్‌లూమ్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ రాజారావు, ఏడీఏ వెంకటరమణతో కలిసి మంగళవారం స్థలాన్ని పరిశీలించారు. ఇందుకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. ఆర్డీఓ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ హ్యాండ్‌లూమ్ ప్రిన్సిపల్ సెక్రటరీ మంజూరైన సందర్భంగా భూపరిశీలన నిర్వహించినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన నివేదికలను జిల్లా ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు తెలియజేశారు. తహసీల్దార్ పద్మావతి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ కోసమే ట్రాన్స్‌ఫార్మర్


మాట్లాడుతున్న ఏడీ ప్రసాద్

గూడూరు: రానున్న వేసవి దృష్ట్యా ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందజేయడమే లక్ష్యంగా 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు విద్యుత్ శాఖ ఏడీఎల్ ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక బనిగీసాహెబ్ పేటలో మంగళవారం నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఎక్కువగా విద్యుత్ కనెక్షన్‌లు ఉన్న కారణంగా తరచూ ట్రిప్ అయిపోతూ ఉండేదన్నారు. ఈ మేరకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, అలాగే రాబోయేది ఎండాకాలం కావడంతో 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను త్వరితగతిన ఏర్పాటు చేశామన్నారు. ఇక ఈ ప్రాంత ప్రజలకు ఎలాంటి విద్యుత్ అసౌకర్యం ఉండదన్నారు. ఏఈ ఏడుకొండలు, సిబ్బంది నరసయ్య, శ్రీధర్‌రాజు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలు నివారించేందుకు చర్యలు


రాపూరు రేంజ్ అధికారి రవీంద్రబాబు

రాపూరు: రాపూరు రేంజ్ పరిధిలోని అడవులకు అగ్నిప్రమాదాలు నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రేంజర్ రవీంద్రబాబు తెలిపారు. స్థానిక అటవీశాఖ కార్యాలయంలో రేంజ్ పరిధిలోని సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అడవుల్లో అగ్నిప్రమాదాలను నివారించేందుకు రాపూరు రేంజ్ పరిధిలో 63 మంది ఫైర్ వాచర్లను నియమించామన్నారు. వీరంతా అటవీశాఖ సిబ్బందికి సహాయసహకారాలు అందిస్తారన్నారు. అడవులను సిబ్బంది నిప్పు, ముప్పులేకుండా చూడాలన్నారు. అడవులకు నిప్పుపెట్టినా, వన్యప్రాణులను వేటాడినా కఠినచర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. వేసవిలో వన్యప్రాణులు నీటి కోసం జనావాసాల్లోకి వచ్చే అవకాశం ఉందని వాటిని రక్షించి అడవుల్లోకి పంపాలని సూచించారు. డీఆర్వోలు ప్రసాద్, రసూల్, స్క్వాడ్ సిబ్బంది ప్రసాద్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

చిన్నప్పటి నుంచే దేశభక్తిని పెంపొందించుకోవాలి


సరస్వతి శిశుమందిరంలో నివాళులర్పిస్తున్న చిన్నారులు

గూడూరు: చిన్నప్పటి నుంచే దేశభక్తిని పెంపొందించుకోవాలని, దేశం కోసం ప్రాణాలర్పించిన వీరజవాన్లను స్మరించుకోవాలని సరస్వతి శిశు మందిరం ప్రిన్సిపల్ శోభారాణి పేర్కొన్నారు. స్థానిక పూలతోటలోని సరస్వతీ శిశుమందిరంలో పుల్వామా దాడిలో అమరులైన సైనికులకు మంగళవారం విద్యార్థులతో కలిసి నివాళులర్పించారు. ఆర్‌ఎస్‌ఎస్ నేత యుగంధర్ పాల్గొన్నారు. అదేవిధంగా పట్టణంలోని లయోలా కళాశాల ఆవరణలో ఏబీవీపీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఏబీవీపీ హాస్టల్స్ జిల్లా కన్వీనర్ చిన్నా, ఏబీవీపీ నేతలు చైతన్య, కిరణ్, కుమారస్వామి, మహేష్, రాజు, కృష్ణ, రోషన్, శివ, జయకృష్ణ, శంకర్ పాల్గొన్నారు.